క్లుప్తంగా

నేడు అద్దంకిలో హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి శనివారం అద్దంకి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. దీనిలో భాగంగా ఉదయం 11.30 గంటలకు బల్లికురవ మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో ఇటీవల మరణించిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొండవర్తు అంజయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం 12 గంటలకు జే. పంగులూరు మండలంలోని కొండమూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు భీమనాథం అంజిరెడ్డి పెద్దకర్మకు హాజరవుతారు. మధ్యాహ్నం 1.00 నుంచి అద్దంకిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని పార్టీ కార్యాలయం వర్గాలు శుక్రవారం తెలిపాయి.

ఎంవీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

అద్దంకి రూరల్: మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ పనులకు పర్మినెంట్ యూనిట్ ఆఫీస్‌ను అద్దంకిలో ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్ సెల్‌లో అద్దంకి టీడీపీ నాయకులు వినతిపత్రాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు.

వరిగడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న వరిగడ్డి వాము

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలో వరిగడ్డివామి దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తన్నీరు కిరణ్‌కు చెందిన నాలుగు ట్రక్కుల వరిగడ్డికి నిప్పంటుకుంది. దీంతో స్థానికులు మంటలార్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవటంతో చిలకలూరిపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వాహనం అందుబాటులో లేకపోవటంతో నరసరావుపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు చేరుకునే సరికి రూ.85 వేలు విలువజేసే వరిగడ్డివాము అగ్నికి ఆహుతైయింది. అసలే వరిగడ్డి దొరకటం కష్టంగా మారిందని ఉన్నపళంగా పశుగ్రాసం మొత్తం దగ్ధమైందని బాధిత రైతు కిరణ్ వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కోరాడు. సమాచారం తెలుసుకున్న ఏఎస్సై శ్రీనివాసరావు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసుకున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



అద్దంకి: యువతకు మాదకద్రవ్యాలతో ప్రమాదం పొంచి ఉందని కట్టారామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగం వాటి వలన కలిగే నష్టాల గురించి కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే మానుకోవడం చలా కష్టమన్నారు. అయితే దాని వల్ల కలిగే నష్టం తెలిస్తే దాని జోలికి వెళ్లరన్నారు. అందుకే శుక్రవారం నుంచి మత్తు పదార్థాల వాడకం వలన కలిగే నష్టాల గురించి వివరించే విధంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని వృక్షశాస్త్ర అధ్యాపకుడు ఎన్ఎస్ఎస్ వన్ అధికారి ప్రయోక్తగా వ్యవహరించారు. న్యాక్ కనీ ్వనర్ రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రొంపేరు ఏడుస్తోంది.. !



రొంపేరు కుడి కాలువలో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క



రొంపేరు ఎడమ కాలువలో విపరీతంగా పెరిగిపోయిన తూటు, జమ్ము, చిల్లచెట్లు

- గుర్రపుడెక్క, తూటుతో నిండిన కాలువలు
- చిట్టడవులను తలపిస్తున్న 'రొంపేరు'
- లక్ష ఎకరాల్లో పంటల ద్వారా కోట్లలో నష్టపోతున్న అన్నదాతలు

కారంచేడు: కాలువ అనగానే నీటితో దర్శనమిస్తాయి. లేదా ఎండిపోయి ఉంటాయి. కానీ వాడరేవు–పిడుగురాళ్ల రహదారిలో కారంచేడు–చీరాల మధ్య రోడ్డు పక్కనే ఉండే రొంపేరు కుడి, ఎడమ కాలువలు మాత్రం పచ్చని రంగులో చిట్టడవులను తలపించేలా దర్శనిమిస్తుంటాయి. అదేంటి అనుకుంటున్నారా..? అవునండి ఈ రొంపేరు కుడి, ఎడమ కాలువలు గుర్రపుడెక్క, తూటు, చిల్లచెట్లు, జమ్ములతో నిండిపోయి ఉంటాయి. దీంతో ఎగువ నుంచి వచ్చే మురుగు మొత్తం గుర్రపుడెక్క, తూటు అడ్డు ఉండటంతో ప్రవాహం సరిగ్గా లేక ఎక్కడికక్కడే నిలిచిపోయి ఇబ్బందికరంగా మారింది. మార్టూరు ఎగువ నుంచి వచ్చే వరదలు, మురుగు ప్రవాహాలు నియోజకవర్గంలోని పర్చూరు కాలువ ద్వారా కారంచేడు దొంగ తూముల వద్దకు చేరుకుంటాయి. కారంచేడు–కుంకలమర్రు రోడ్డులోని దొంగ తూముల సమీపంలో ఈ పర్చూరు వాగు రెండు పాయలుగా చీలి రొంపేరు కాలువగా పిలువబడుతుంది. ఈ చీలికల్లో ఒకటైన రొంపేరు ఎడమ కాలువ సుమారు 15 కిలోమీటర్లు ప్రవహించి ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ ద్వారా సముద్రంలో కలుస్తుంది. మరో చీలిక రొంపేరు కుడి కాలువ సుమారు 20 కిలోమీటర్లు ప్రవహించి వేటపాలెం స్ట్రయిట్‌కట్ ద్వారా సముద్రంలో కలుస్తుంది.

రెండు కాలువల్లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క..

సుమారు 50 కిలోమీటర్లకు పైగా 30 గ్రామాలను కలుపుకుంటూ ఆయా గ్రామాల్లోని మురుగునీటితో పాటు ఎగువ నుంచి వచ్చే వరద నీటితో రొంపేరు ప్రవహిస్తుంది. కుడి, ఎడమ కాలువలు ప్రస్తుతం గుర్రపుడెక్క, తూటు, జమ్ములతో దట్టంగా నిండిపోయి ఉన్నాయి. దీంతో ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో ఎగువ నుంచి వరదలు రాకపోయినా, అనేక గ్రామాల నుంచి వచ్చే మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రెండు కాలువలకు ఇరువైపులా కారంచేడుకు చెందిన ఉత్తర, దక్షిణ పొలాలుగా పిలుచుకొనే సాగు భూములున్నాయి. ఈ కాలువకు ఇరువైపులా కారంచేడు, చీరాల, చినగంజాం, వేటపాలెం మండలాలకు చెందిన సుమారు 80 వేల నుంచి లక్ష ఎకరాల వ్యవసాయ సాగు భూములున్నాయి. రొంపేరు కాలువలో మురుగునీటి ప్రవాహం జరగకపోవడం వలన దిగువన ఉన్న సుమారు 50 వేల ఎకరాలు, అలాగే ఎగువున ఉన్న పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాల్లోని సుమారు 50 వేల ఎకరాల్లోని సాగు భూమలు చెరువులను తలపిస్తుంటాయి. ముంపునకు గురయిన సందర్భాల్లో రైతులు పంటల సాగు వలన రూ.కోట్లలో నష్టాన్ని చవిచూస్తున్నారు.

పంటలకు ముప్పుగా ఉన్న రొంపేరు..

రొంపేరు కుడి, ఎడమ కాలువల వలన రైతులు ఏటా కోట్ల రూపాయల్లో పంటను నష్టపోతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదలు, మురుగుతో పాటు తుఫాను ప్రభావం ఈ ప్రాంత రైతులపై అధికంగా పడుతుంది. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలి.

– వై శ్రీనివాసరావు, రైతు, కారంచేడు

ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించాలి..

ఎగువ ప్రాంతాలైన మార్టూరు, యద్దనపూడి, పర్చూరు వాగులతో పాటు, గండి నుంచి వచ్చే వరదలు, మురుగు నీరు దిగువకు ప్రవహించే వీలు లేకుండా పోయింది. కాలువలు పూర్తిగా మూసుకుపోయాయి. దీంతో మురుగునీరు, వరదనీరు దిగువకు ప్రవహించే వీలు లేకుండా పోయింది. అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

– డీ నాగశ్రీనివాసరావు, రైతు, కారంచేడు

శాశ్వత పరిష్కారం చూపని అధికారులు..

రొంపేరు కుడి ఎడమ కాలువల్లో తూటు, జమ్ము పేరుకు పోవడం ఇది కొత్తేమి కాదు. ప్రతి ఏటా ఈ విధంగా తూటు పేరుకుపోవడం వలన గతంలో వరదల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. పంటలు చేతికందే సమయంలో వచ్చే తుఫానుల వలన ఎగువ ప్రాంతాల నుంచి వరదలు విపరీతంగా వచ్చిపడేవి. పర్చూరు వాగు, అలుగు వాగు గుండా వచ్చే వరదలు కారంచేడు సమీపంలో రొంపేరు కాలువ దగ్గరకు వచ్చే సరికి అవి కాలువల్లో ప్రవహించే వీలు లేక అవి పంట చేల మీదకు పడేవి. దీంతో మండలంలోని కుంకలమర్రు, స్వర్ణ, రంగప్పనాయుడువారిపాలెం, ఆదిపూడితో పాటు కారంచేడు ఉత్తర, దక్షిణ ప్రాంత పొలాలు పూర్తిగా మునిగిపోయేవి. దీంతో సుమారు పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లోని రైతులు కోట్లల్లో నష్టపోతున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో వచ్చిన తుఫానులతో వచ్చిన వరదల సమయంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాత్కాలిక నిధులు విడుదల చేయించి మరమ్మతులు, తూటు తొలగింపు కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేవలం తాత్కాలిక పనులు కాకుండా తూటు, గుర్రపుడెక్క, జమ్ములను మొదలుకంటూ తీసివేసే పనులు చేసి శాశ్వతంగా నిర్మూలించగలిగితేనే రైతులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ప్రజలంటున్నారు.

పారుదల లేని మురుగుతో తప్పని ఇక్కట్లు..

కారంచేడు దగ్గర రొంపేరు కుడి కాలువలోకి గ్రామంలోని మురుగునీటిని పంపించే మార్గాలున్నాయి. మధ్య బస్టాండు సమీపంలోను, అంబేడ్కర్ కాలనీ సమీపంలోని ఆర్‌సీఎం చర్చి ఎదురుగా ఒకటి, భారత్ గ్యాస్ గోదాము సమీపంలో మరొకటి ఉన్నాయి. వీటి ద్వారా ప్రవహించే మురుగును కాలువలోకి కూడా రాకుండా చెత్తా, చెదారాలు అడ్డుపడుతున్నాయి. దీంతో దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలు అంటు వ్యాధుల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

అనారోగ్య బాధితుడికి చెక్కు అందజేత

- జాన్‌వెస్లీకి ఉపాధ్యాయులు, ఎన్ఆర్ఐలు చేయూత

సాక్షి ఎఫెక్ట్..

బల్లికురవ: మెదడులో ఇమ్యూనిటీ సక్రమంగా లేక ఇన్‌ఫెక్షన్‌తో 20 రోజులుగా వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతున్న బాలుడు జాన్‌వెస్లీకి పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్ఆర్ఐలు చేయూతనివ్వడం అభినందనీయమని ఎంఈవో–2, కె. రమేష్‌బాబు అన్నారు. జూలై 15న సాక్షి దినపత్రికలో 'నాబిడ్డను బతికించండి' అన్న శీర్షికతో కథనం ప్రచురించడంతో దాతలు స్పందిస్తూ చేయూతనిస్తూనే ఉన్నారు. శుక్రవారం పెద అంబడిపూడి ఉన్నత పాఠశాలలోరూ. 1.6 లక్షల చెక్కును బాలుడు తల్లిదండ్రులకు అంజేశారు. ఈపాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న జాన్ వెస్లీకి 20 రోజులు క్రితం టైఫాయిడ్ జ్వరంతో అస్వస్థతకు లోనవగా తొలుత నరసరావుపేటలోని ఓ ప్రవేటు వైద్యశాలకు అక్కడ నుంచి విజయవాడ వైద్యశాలలకు చికిత్సకు తీసుకెళ్లారు. రెక్కాడితేకాని నిరుపేద కుటుంబానికి చెందిన ఈ బాలుడికి దాతలు చేయత ఇవ్వడం వల్లే ఇప్పటికి రూ. 10 లక్షల వరకు వైద్యం చేయిస్తున్నారు. హెచ్ఎం గన్నమనేని శివలింగారావు, ఉపాధ్యాయులు, రెండు రోజుల క్రితం విజయవాడలోని వైద్యశాలకు వెళ్లి బాలుడిని పరామర్శించి తమ వంతు సాయంగా రూ. 65 వేలు అందజేశారు. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి ఎన్ఆర్ఐ బత్తుల అనిల్ చౌదరికి జాన్‌వెస్లీ ఆనారోగ్య పరిస్థితి కుటుంబ ఆర్థిక పరిస్థితులు వివరించారు. వెంటనే అక్కడి తోటి మిత్రుల సహకారంతో రూ. 1.6 లక్షలు అందజేయగా విద్యార్థి తల్లిదండ్రులకు చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా సుధారాణి, చినబాబు దంపతులు మాట్లాడుతూ ఇప్పటికే దాతల ద్వారా అందిన సాయంతో తమ బిడ్డను బతికించుకోగలగుతున్నామని, భగవంతుడు, దాతలు ఆశీర్వాదాలతో తమ బిడ్డ పునర్‌జన్మతో పాఠశాలకు వచ్చి చదువుకొనసాగిస్తాడన్న నమ్మకంతో ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు బీ. వెంకట నరసయ్య, దద్దాల అంజయ్య, మందలపు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాన్‌వెస్లీ తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎంఈవో, హెచ్ఎం, గ్రామపెద్దలు

ఘనంగా పింగళి వెంకయ్య 148వ జయంతి

చీరాల అర్బన్: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్.మురళి అధ్యక్షత వహించి మాట్లాడారు. పింగళి వెంకయ్య 1876 ఆగస్టు 2న జన్మించారన్నారు. ఒక జాతికి, ఆ జాతి నిర్వహించే ఉద్యమానికి ఒక పతాకం అవసరమన్న గొప్ప వాస్తవాన్ని 1906లో ఆయన కలిగిందన్నారు. జాతీయ పతాకాన్ని ఖరారు చేయడానికి కాంగ్రెస్ సభలో ఆయన పడిన శ్రమ, తపన అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్ హెడ్ ఎస్.సాయిప్రసన్న, ఎకనామిక్స్ డిపార్టుమెంట్ హెడ్ డి.జాన్‌రాజ్, హిస్టరీ డిపార్టుమెంట్ హెడ్ ఐ.సుగుణకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు ఇందిరా కాలనీలో వైద్య శిబిరం

చినగంజాం (పర్చూరు): నేడు పర్చూరులోని ఇందిరా కాలనీలో ఉదయం 11 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇదే కాలనీలో అంటు వ్యాధులు ప్రబలి అనేక మంది ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారు. దింతో అక్కడ కొన్ని రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చెసిన విషయం అందరికీ తెలిసిందే. వర్షా కాలంలో వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యల కోసం మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించనున్నారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు



మేదరమెట్ల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లి ఆయన నివాసంలో కొరిశపాడు మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో మాజీ ఎంపీపీ అన్నెం అంజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్తవరపు రమణయ్య, మేదరమెట్ల మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు ఉన్నారు.

ముర్రుపాలు ప్రతి బిడ్డకు శ్రేయస్కరం



వాడరేవులో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న ఆశ, అంగన్‌వాడీలు



రంగప్పనాయుడువారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

చీరాల టౌన్: ముర్రుపాలు ఇవ్వడం వలన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సునంద సూచించారు. మండలంలోని వాడరేవు గ్రామ పంచాయతీ స్థాయిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యాన్ని తెలపడంతో పాటుగా ఐసీడీఎస్ అందిస్తున్న పథకాలను ప్లకార్డుల ద్వారా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, గర్భిణులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఝాన్సీరాణి, విజయ, లక్ష్మీ, ప్రమీలారాణి, సుజాత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జే.పంగులూరు: ముర్రుపాలు ఇవ్వడంతో తల్లితో పాటు బిడ్డకు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందని, ప్రతి తల్లి బిడ్డలకు పాలు ఇవ్వాలని అంగన్‌వాడీ పంగులూరు సెక్టార్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. శుక్రవారం పంగులూరులోని అంగన్‌వాడీ–1 కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంగులూరు అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత, ఆయా వెంకటరమణమ్మ, ఆశాలు అంజమ్మ, అనురాధ, సంధ్య, తల్లులు పాల్గొన్నారు.

కారంచేడు: తల్లి పాలు బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. ఆమె మండలంలోని రంగప్పనాయుడువారిపాలెం అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలల్లో పాల్గొని తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అక్కా, కోటేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి అవసరం



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి

కారంచేడు: గ్రామాల్లో రైతులు, ప్రజల సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని చీరాల ఆర్డీఓ జీ సూర్యనారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల రెవెన్యూ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ప్రధానంగా రైతుల నుంచి, గ్రామస్తులు, విద్యార్థుల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాల్సి ఉందన్నారు. పెండింగ్ అర్జీలు, సత్వర పరిష్కారానికి అనువుగా లేని అర్జీలను గుర్తించి తమకు తెలియజేయాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులకు తెలిపి వాటి పరిష్కారంకు సమిష్టి కృషి చేద్దామన్నారు. అనంతరం జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీలో మండల కేంద్రమైన కారంచేడు చాలా తక్కువ శాతంలో ఉందని, అందుకు గల కారణాలను ఆయన డీటీలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కేవలం 11 శాతం మాత్రమే పంపిణీ జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కే నరశింహారావు, డీటీ పీ సుశీల, అరుణ, ఆర్ఐ, వీఆర్‌ఓలు, రేషన్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవానికి ముస్తాబు



వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయం

బల్లికురవ: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బల్లికురవలోని గ్రామ దేవత పోలేరమ్మ ఆలయ 13వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. గ్రామస్తులు సమష్టి కృషితో జీర్ణావస్థతో కూలే దశలో ఉన్న ఆలయాన్ని 13 సంవత్సరాల క్రితం పునఃనిర్మాణంతో అమ్మవారిని ప్రతిష్టించారు. నిత్య పూజలతోపాటు ఆదివారం ప్రత్యేక పూజలు రాత్రికి భజనలు నిర్వహిస్తున్నారు. వేడుకలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతూ విద్యుత్ దీపాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు, అలంకరణ ఆదివారం గ్రామ పొంగళ్లు అమ్మవారికి నివేదన పాటకచేరితోపాటు భజనలు, గ్రామస్తుల సమష్టి కృషితో అన్న సంతర్పణ చేస్తున్నట్లు ఆలయ కమిటీ వివరించారు. ఈవేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాలోని భక్తుల పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

హాస్టల్ వదలి పరారీకి విద్యార్థినుల యత్నం

చీరాల: హాస్టల్ వార్డెన్ వ్యవహరిస్తున్న వైఖరితో ఇబ్బంది పడుతున్న ముగ్గురు విద్యార్థినులు శుక్రవారం హాస్టల్ నుంచి పరారయ్యేందుకు యత్నించారు. స్థానిక సాయిప్యాలెస్ రోడ్డులోని బాలికల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో పది సంవత్సరాలు ఉన్న విద్యార్థినులు హాస్టల్ వార్డెన్ వ్యవహరిస్తున్న తీరుతో బయటకు వచ్చారు. మార్కెట్ సెంటర్ వద్ద ఉన్న వీరిని గమనించిన స్థానికులు వారిని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిగా ఎస్సై వారితో మాట్లాడి తిరిగి హాస్టల్‌కు పంపించారు. ఈ మేరకు తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

పలువురు అధికారుల బాధ్యతల స్వీకరణ



ఎం శేషగిరిరావు



డీ.వెంకటేశ్వరరావు



టీ. పార్వతి

మార్టూరు: పలువురు తహసీల్దార్లు, సీఐలు శుక్రవారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు.

మార్టూరు సీఐగా శేషగిరిరావు బాధ్యతలు చేపట్టారు. శేషగిరిరావుకు గతంలో మార్టూరు ఎస్సైగా పనిచేసిన అనుభవం ఉంది. ఈసందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండల తహసీల్దార్‌గా డీ.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన బాపట్ల జిల్లా భట్టిప్రోలులో ఆతరువాత ప్రకాశం జిల్లా రాచర్లలో తహసీల్దార్‌గా పనిచేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

వేటపాలెం: వేటపాలెం తహశీల్దార్‌గా టీ పార్వతి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె గుంటూరు జిల్లా కాకుమాను నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనుల వచ్చే ప్రజల సమస్యలు సత్వరమే పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ కార్యాలయాలపై విద్యార్థులకు అవగాహన



పంచాయతీ వద్ద సిబ్బందితో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుంకలమర్రు (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో వారి గ్రామాల్లో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, అందులో విధులు నిర్వహించే అధికారులు, వారి విధులు వంటి విషయాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు విద్యార్థులను సిద్ధం చేశామని హెచ్ఎం శ్యామల అన్నారు. శుక్రవారం మండలంలోని కుంకలమర్రు గ్రామంలోని చర్చి కాంపౌండ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, గ్రామ సచివాలయం, పోస్టాఫీసు, యూనియన్ బ్యాంక్‌లను సందర్శించి వారి విధులను చూపించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పీ నాగమణి, వీ బాబూరావు పాల్గొన్నారు.

రెస్టారెంట్ యజమానిపై దాడి

చీరాల: పట్టణంలోని దుబాయ్ షేక్ రెస్టారెంట్ యజమాని పిక్కి నారాయణపై స్థానిక హైయ్యర్‌పేటకు చెందిన పలువురు యువకులు శుక్రవారం దాడి చేసి గాయపరిచారు. డబ్బుల విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ దాడికి దారితీసిందని పోలీసుల సమాచారం. క్షతగాత్రుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు అవుటు పోస్టు పోలీసులు క్షతగాత్రుడి వద్ద నుంచి వివరాలను నమోదు చేశారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నిరసన

కారంచేడు: గతంలో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారిని ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు పీ కొండయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ముందు సర్పంచ్ బాలిగ శివపార్వతి, గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులతో కలసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ కారంచేడులో ఇటీవల జరిగిన పంచాయతీ టెండర్లలో అవకతవకలు జరిగాయన్నారు. పంచాయతీలో టెండర్‌దారులు, కాంట్రాక్టర్లు మారిన ప్రతిసారి కార్మికులను తొలగించడం ఏంటన్నారు. గతంలో పనిచేసిన కార్మికులను కొనసాగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వినతులతో కూడిన పత్రాన్ని ఎంపీడీఓకి అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, గ్రామస్తులు

కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు

- జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

అద్దంకి: కౌలు రైతులకూ వ్యవసాయ రుణాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వై రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు ఉన్న ప్రతి రైతుకు పంట రుణం మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 10 వేల కౌలు గుర్తింపు కార్డులు అందించామని అర్హత ఉన్న ప్రతి రైతుకు పంట రుణం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, ఏడీఏ కె.ధనరాజ్, మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు అద్దంకి మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, బల్లికురవ వ్యవసాయాధికారి కుమారి, సంతమాగులూరు వ్యవసాయాధికారి లావణ్య, కొరిశపాడు మండల వ్యవసాయధికారి శ్రీనివాసరావు, పంగులూరు వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, అన్ని బ్యాంక్‌ల మేనేజర్‌లు పాల్గొన్నారు.